

6న పట్టిసం మహాశివరాత్రి ఉత్సవ కమిటీ సమావేశం

ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ

ప్రజాశక్తి - పోలవరం

మహాశివరాత్రి సందర్భంగా పట్టిసం శ్రీ వీరేశ్వరస్వామి వారి దర్శనానికి వచ్చే యాత్రికులకు విస్తృత సౌకర్యాలు కల్పించే విషయంపై ఈ నెల 6వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు పట్టిసం శ్రీవీరేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో మహాశివరాత్రి ఉత్సవ కమిటీ రెండో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 25వ తేదీ నుండి ఫిబ్రవరి 27 వరకు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తామని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా సంబంధిత అధికారులందరూ సదరు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

నిరు(ఉ)ద్యోగుల.. ఓ(వే)టు..!

- నిరుద్యోగ భృతిపై కూటమి సర్కార్ మౌనంపై తీవ్ర చర్చ
- సూపర్ సిక్స్‌లో తొలి హామీ నిరుద్యోగ భృతినే
- తూర్పు, పశ్చిమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలపై 'భృతి' ప్రభావం
- 3.15 లక్షల మంది ఓటర్లలో లక్ష మందికిపైగా నిరుద్యోగులే
- పెద్ద సంఖ్యలో ఉన్న ఉద్యోగ ఓటర్లు తీవ్ర అసంతృప్తిలోనే
- ఏ మార్చేందుకు రంగంలోకి కూటమి ఎంఎల్‌ఎలు
- రసవత్తరంగా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికార టిడిపి ఎంఎల్‌సి ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. నియోజకవర్గాలవారీగా ఎంఎల్‌ఎలు, ఎన్నికల పరిశీలకులు సమావేశాలు ఏర్పాటు చేసి కూటమి నేతలకు దిశానిర్ధేశం చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో కీలక ఓటర్లుగా ఉన్న నిరుద్యోగులు, ఉద్యోగులు కూటమి సర్కార్ ఆశలకు గండికొట్టే పరిస్థితి ఉందనే భయం ఆ పార్టీ నాయకులను వెంటాడుతోంది. 2024 మేలో జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి మేనిఫెస్టోలో తొలి హామీ నిరుద్యోగులకు రూ.మూడు వేలు భృతి అందించడం. కూటమి సర్కార్ అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతికి సంబంధించి నోరు మెదపలేదు. 2014-19 ఎన్నికల్లో రూ.రెండు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన టిడిపి ఎన్నికలకు ఆరు నెలల ముందు అమల్లోకి తెచ్చి కొద్దిమందికి మాత్రమే ఇచ్చి మమ అనిపించింది. ఇప్పుడు కూడా అదే తరహాలో పాలన ముగిసే సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తుందా అనే అనుమానం నిరుద్యోగుల్లో నెలకొంది. దీంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు ఎటువైపు వేయాలని నిరుద్యోగులు ఆలోచనలో పడ్డారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో లక్ష మందికిపైగా నిరుద్యోగులు ఉన్నట్లు అంచనా. నిరుద్యోగులు పెద్దసంఖ్యలో ఉండటంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఓటెలా అడుగుతారు..?

నిరుద్యోగ భృతి అమలు చేయకుండా, ఉద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయకుండా టిడిపి నాయకులు ఓటు ఎలా అడుగుతారు అనే చర్చ క్షేత్రస్థాయిలో నడుస్తోంది. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు కూటమి తమ శక్తియుక్తులను మొత్తం ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాలవారీగా ఓటర్ల జాబితాలు తీసి ఎంఎల్‌ఎలకు బాధ్యతలు అప్పగిస్తోంది. ఎంఎల్‌ఎల అనుచరగణం ఓటర్లకు ఫోన్లు చేసి ఓటు టిడిపి అభ్యర్థికి వేయాలని కోరుతున్నారు. ఇప్పుడు ఓటు వేస్తే నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహించే అవకాశం ఉందని, ఓటేయకపోతే యువతలో వ్యతిరేకత వచ్చిందనే అభిప్రాయంతో ప్రభుత్వం హామీలు అమలు చేస్తుందనే చర్చ సాగుతోంది. అంతేకాకుండా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉద్యోగులు పెద్దసంఖ్యలో ఓటర్లుగా ఉన్నారు. ఇప్పటి వరకూ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం ఒక్క హామీనీ అమలు చేయలేదు. డిఎలు ఇవ్వడంగాని, సిపిఎస్‌పై నోరు మెదపడంగాని, పిఆర్‌సి కమిటీ ఏర్పాటుపైగాని ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు ఎటువంటి భరోసా దక్కలేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలపై ఈ ప్రభావం పెద్దఎత్తున పడే అవకాశం కన్పిస్తోంది. నిరుద్యోగులు, ఉద్యోగుల ఓట్లపై టిడిపి లోలోన ఆందోళన చెందుతున్నప్పటికీ బయటికి మాత్రం గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది.

టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవుల మధ్యే ప్రధాన పోటీ కొనసాగనుందని తెలుస్తోంది. టిడిపి తన అధికార బలంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానాన్ని గెలుచుకోవాలని విశ్వప్రయత్నం చేస్తోంది. పిడిఎఫ్‌కు ఉద్యోగులు, నిరుద్యోగుల్లో పెద్దఎత్తున బలం ఉంది. ఇటీవల జరిగిన తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపా ధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి తొలి ఓటుతోనే భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం అందరికీ తెలిసిందే. 2019 మార్చిలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి ఇళ్ల వెంకటేశ్వరరావు భారీ మెజార్టీతో గెలిచారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై అధికార పార్టీ ఎంఎల్‌సిలు శాసనమండలిలో మాట్లాడే పరిస్థితి ఎప్పుడూ కనిపించదు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిరంతరం ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడటం, వారు చేస్తున్న ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొనడం సైతం జరుగుతోంది. దీంతో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లు ఎక్కువగా పిడిఎఫ్ అభ్యర్థులకే ఓటు వేయడం జరుగు తోంది. ఈ ఎన్నికల్లోనూ పిడిఎఫ్ అభ్యర్థి గట్టి పోటీలో ఉన్న పరిస్థితి నెలకొంది. గెలుపెవరిదో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న అభ్యర్థి శ్రీనివాస్

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు మరో నామినేషన్

రెండుకు చేరిన నామినేషన్ల సంఖ్య - మీడియా సెంటర్ ఏర్పాటు ఎప్పుడో..?

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మంగళవారం మరో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ముళకల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ముళకల శ్రీనివాస్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ వేసిన అభ్యర్థితో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. సహాయ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఈ నెల మూడో తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఇప్పటి వరకూ దాఖలైన నామినేషన్ల సంఖ్య రెండుకు చేరింది. ఇప్పటి వరకూ నామినేషన్లు వేసిన వారంతా ఇండిపెండెంట్ అభ్యర్థులే. ఎంఎల్‌సి ఎన్నికల బరిలో నువ్వా..నేనా అంటూ తలపడుతున్న పిడిఎఫ్, టిడిపి అభ్యర్థులు ఇంకా నామినేషన్లు వేయలేదు. ఆరు, ఏడు తేదీల్లో ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

మీడియా సెంటర్ ఏర్పాటు ఉంటుందా?

ఎన్నికల సమాచారం వంటివి అందించేందుకు ప్రతి ఎన్నికల్లో మీడియా సెంటర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు. ఎన్నికల సంబంధిత అధికారులు అందుబాటులోకి రాకపోతే సమాచారం ఇవ్వడంలో మీడియా సెంటర్ కీలక పాత్ర పోషిస్తోంది. మీడియా సెంటర్ ఏర్పాటు చేస్తామని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై రెండు రోజులు గడిచిపోయింది. ఇప్పటి వరకూ మీడియా సెంటర్ ఏర్పాటు ఎక్కడా కానరాని పరిస్థితి నెలకొంది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం పూర్తిస్థాయిలో మీడియాకు అందని పరిస్థితి ఏర్పడింది. మీడియా సెంటర్ ఏర్పాటు ఉంటుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

ఖైదీలకు అన్ని విషయాలూ తెలపాలి

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



ఆహారం నాణ్యతను పరిశీలిస్తున్న రత్నప్రసాద్

శిక్ష అనుభవించే ఖైదీలకు సంబంధించిన ప్రతి విషయాన్నీ వారికి కూలంకుషంగా తెలియజేయాల్సిన బాధ్యత జైలు సిబ్బందిదే అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఆయన మంగళవారం ఏలూరులోని జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, వైద్యం, పరిశుభ్రత మొదలైన వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడుతూ పోలీసులు అరెస్టు చేసేటప్పుడు అరెస్టు విషయాన్ని దగ్గర బంధువులకుగాని, స్నేహితులకుగాని తెలియపర్చాలన్నారు. కేసు వివరాలకు సంబంధించిన పత్రాలను సంబంధిత ముద్దాయిలకు అందజేయాలని, ఇది ఖైదీల హక్కని చెప్పారు. లేనిపక్షంలో సంబంధిత మెజిస్ట్రేట్ ముందు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అవసరమైన ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి, న్యాయ సహాయం అందిస్తుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కారాగారం సూపరింటెండెంట్ సిహెచ్ఆర్‌వి.స్వామి, జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు

విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం

రెండోరోజు కొనసాగిన క్లాప్ ఆటో డ్రైవర్ల ధర్నా



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అక్రమంగా తొలగించిన క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ హెచ్చరించారు. అక్రమంగా తొలగించిన తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద క్లాప్‌ఆటోల డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ రోజురోజుకీ పట్టణాలు, నగరాల్లో జనాభా పెరుగుతోందని, ప్రజల పారిశుధ్య అవసరాలు పెరుగుతున్నాయని తెలిపారు. క్లాప్ ఆటోలు పెంచి పట్టణాల పరిశుభ్రతకు పాటుపడాల్సిన అధికారులు, దానికి భిన్నంగా ఉన్న వాహనాలను తొలగించడం అవివేకమని విమర్శించారు. నగరపాలక సంస్థ అధికారులు ఎలాంటి విధివిధానాలు పాటించకుండా, ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా, అన్యాయంగా క్లాప్ ఆటోల డ్రైవర్లను తొలగించడం చట్టవిరుద్ధమని ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం, పాలకవర్గం స్పందించి అక్రమంగా తొలగించిన క్లాప్ ఆటోల డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని, క్లాప్ ఆటోలను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుతుందని ఆయన తెలిపారు. సిఐటియు అనుబంధ సంఘాలన్నీ క్లాప్‌ఆటో డ్రైవర్ల ఉద్యమానికి మద్దతుగా నిలబడతాయని ఆయన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ అధికారులు, పాలకవర్గం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా క్లాప్ ఆటోల డ్రైవర్లను తొలగించడం అన్యాయమన్నారు. కనీసం బకాయి పడ్డ జీతాలు కూడా చెల్లించకపోవడం దారుణమని అన్నారు. సంవత్సర కాలంగా పిఎఫ్, ఇఎస్ఎల్ జమ చేయట్లేదని తెలిపారు. ఆటో, ట్రాలీ డ్రైవర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీ మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే సమయంలో ఇప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేన నాయకులు క్లాప్ ఆటోల డ్రైవర్ల ఆందోళనకు మద్దతు తెలియజేశారని, సంవత్సరం తిరిగేసరికి అధికారంలోకి రాగానే వారిని విధుల నుంచి తొలగించారని, ఇది ఏ విధంగా సమంజసం అని ప్రశ్నించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు మాట్లాడుతూ క్లాప్ ఆటోల డ్రైవర్లను తొలగించడం వల్ల నగరంలో చెత్త పేరుకుపోతుందని, పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని క్లాప్ ఆటోలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు జి.రాజు, కార్యదర్శి బి.శ్రీను, హరీష్, గణేష్, సుగుణరావు, పుష్పరాజు, జోజి తదితరులు నాయకత్వం వహించారు. ఆందోళనకారులు అక్రమంగా తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని, క్లాప్ ఆటోలను కొనసాగించాలని, ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా తొలగించడం అన్యాయమని, మా ఉద్యోగాలు ఇచ్చేవరకు పోరాడుతామని పెద్దఎత్తున నినదించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్‌కు అందజేశారు.

రూ.1200 కోట్ల టర్నోవర్ మా సొంతం

కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



పాడి రైతులను సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

పాడి రైతుల కృషి ఫలితంగా 1965లో పామర్రు పరిసరాల్లోని 30 గ్రామాల్లో మొదలైన కృష్ణా మిల్క్ యూనియన్ అంచెలంచెలుగా ఎదిగి నేడు 1200 గ్రామాల్లో ఏటా 11 కోట్ల లీటర్ల పాల సేకరణతో రూ.1200 కోట్ల టర్నోవర్‌కు చేరుకుందని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ప్రతి నాలుగు నెలలకోసారి పాడి రైతులకు బోనస్ చెల్లిస్తున్న ఏకైక సహకార సంస్థ ఇదేనన్నారు. మంగళవారం మండల పరిధిలోని అడవినెక్కలం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘ సభ్యులతో ఆయన సమావేశమై కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని పాడి రైతులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం సంఘంతో మమేకమై ఏళ్ల తరబడి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మాదాల జనార్ధనరావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పల్లగాని కొండలరావు, మేనేజర్ యశ్వంత్, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు



ఉంగుటూరు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చినవెల్లమిల్లి, నీలాద్రిపురం రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యాన పంటలు, యాజమాన్య పద్ధతుల గురించి మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ఎన్ఎస్.ప్రవీణ్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి దేవదానం రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంట నమోదు కార్యక్రమం ఈనెల 20వ తేదీన ముగుస్తుందని, కాబట్టి రైతులందరూ వారి పంటల వివరాలు రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని వివరించారు.

చాట్రాయి : మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డివిజనల్ సహాయ వ్యవసాయ శాఖ అధికారి జి.విద్యాసాగర్ పాల్గొని మాట్లాడారు. రైతులు మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. సస్యరక్షణ, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడాలని రైతులకు సూచించారు. ఇ పంట నమోదు, ఇకెవైసి చేయించని రైతులు వెంటనే రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ.ఉదయ భాస్కర్, విఆర్ఒ, రైతులు పాల్గొన్నారు.




ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల : మండలంలోని బుట్టాయగూడెం గ్రామంలో సోమవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ హబీబ్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించుకుని అధిక లాభాలు సాధించాలన్నారు. రైతులు నూతన పద్ధతిలు అవలంబిస్తూ సాగు ఖర్చులు తగ్గించుకుని, ముందుకు వెళ్లాలన్నారు. రైతులకు కావాల్సిన సాంకేతిక సలహాలు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టే విధంగా రైతులను ముందుకు నడిపించే మంచి వ్యవసాయ దిగుబడులు సాధించేందుకు రైతులు అందరికీ వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు విషారాజ్‌కుమారి మాట్లాడుతూ రైతులకు సొసైటీల ద్వారా కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులకు అందుబాటులో ఉంటూ అన్ని రకాల తోడ్పాటు అందిస్తుందని తెలియజేశారు. మండల ఉద్యాన అధికారి దేవదానం మాట్లాడుతూ ఉద్యాన పంటలు, వాటి సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అనంతరం బుట్టాయగూడెం గ్రామంలోని వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, మండల వ్యవసాయ అధికారి ఎ.దుర్గా రమేష్, విహెచ్ఎ.నిహారిక పాల్గొన్నారు.

టి.నరసాపురం : రైతులు మొక్కజొన్న సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని మండల వ్యవసాయశాఖ అధికారిణి బి.సుమలత తెలిపారు. మండలంలోని వెలగపాడు, అల్లంచర్ల రాజుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు తగు మోతాదులో పురుగు మందులు వినియోగించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని కొత్త రావిచర్ల, పాత రావిచర్ల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ఎ.చాముండేశ్వరి మాట్లాడుతూ ఎండ తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిటీ రైతులకు అందుబాటులో ఉందని తెలిపారు. వేప సంబంధిత మందులతో పురుగు నివారణకు సిఫార్సు చేయడమైనది, వేప నూనె మూడు మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారిని ఆర్.హేమ మాట్లాడుతూ మామిడి తోటలను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఎండు పుల్ల లేకుండా మామిడి చెట్టును ఉంచాలని సూచించారు. ఇలా శుభ్రంగా ఉండటం వల్ల తామర పురుగు, పండు ఈగ పురుగుల ఉధృతి పెరగకుండా ఉంటుందని సూచించారు. గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం సేకరణలో రైతులకు 24 గంటల్లో ప్రభుత్వం ద్వారా రైతుల ఖాతాలో డబ్బు చెల్లుబాటు అయిందని హర్షం వ్యక్తం చేశారు.



చాట్రాయిలో..

చింతలపూడి : మొక్కజొన్న పంట రైతులు ఎరువుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చింతలపూడి వ్యవసాయ మండల అధికారి మీనా కుమారి అన్నారు. ప్రగడవరం గ్రామంలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో ఎఫ్ఎంసి పథకం కింద మొక్కజొన్న పంటపై క్లస్టర్‌పై డెమో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటలు శాస్త్రీయ పద్ధతిలో మొక్కజొన్న సాగు పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల పురుగుల మందులు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'పది' విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచాలి

ఐటిడిఎ పిఒ రాముల నాయక్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రాముల నాయక్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి చదివే విద్యార్థుల తరగతి గదికి వెళ్లి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఒ మాట్లాడుతూ గతేడాది కంటే ఉత్తీర్ణతా శాతం పెరగాలని అన్నారు. దీనికి ఉపాధ్యాయుల కృషితోపాటు విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఆయన వెంట ఎటిడబ్ల్యూఒ జి.జనార్ధన్, డివైఇఒ జి.రామ్మోహన్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా చర్యలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ స్థానిక గుడ్ సమరిటన్ కేన్సర్ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందికి రహదారి భద్రతకు తీసుకోవలసిన చర్యలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధారణ, సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ఎలా ప్రాణాలు కాపాడుకోవచ్చో సూచించారు. రహదారి భద్రతా నియమాలు, ప్రమాదానికి గురైన వారికి ప్రథమ చికిత్స చేసే విధానంపై అవగాహన కలిగించారు. అతివేగం ప్రమాదకరమని, మద్యపానం చేసి వాహనాలను నడపరాదని తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరులో హెల్మెట్, వాహనాలకు సరైన పత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేశామని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర హెచ్చరించారు. స్థానిక సిఆర్ రెడ్డి కళాశాల వద్ద మంగళవారం మోటారు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్, వాహనాలకు సరైన పత్రాలు లేని 30 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి అపరాధరుసుము వసూలు చేసినట్లు చెప్పారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రజ్ఞ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విజయ్

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గల శ్రీ శ్రీనివాస రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వరంగల్ నుంచి వచ్చిన ఇక్బాల్ విజయ్ మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్ వారి సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్, సైబర్ సెక్యూరిటీ ఎవేర్‌నెస్ గురించి వివరించారు. సమయపాలన ప్రాముఖ్యత, విద్యార్థులు ఫోన్ వాడకం కోసం విలువైన సూచనలు చేశారు. ప్రతిరోజు ప్లానింగ్ అవసరమని తెలిపారు. బుక్ రీడింగ్ అవసరమని, ఈరోజు నుంచి నిరంతరం కష్టపడాలని, సమయాన్ని వృథా చేసుకోవద్దని, ఉన్న సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజు విజ్ఞానాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. పలు ప్రశ్నలకు జవాబు చెప్పిన విద్యార్థినులకు మేమెంటోలు, లక్ష్మీసాయి, అంజని బహుమతులు అందజేశారు. లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ రాజు, ప్రధానోపాధ్యాయిని రాధికా రాణి, ఉపాధ్యాయులు రవీంద్ర, మల్లేశ్వరి, కృష్ణవేణి, మోహనరావు, మనోహరం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్ బాబు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

యువత భవిష్యత్‌ను నిర్వీర్యం చేస్తున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టాలని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని నివారించాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు, ఆరోగ్య కార్యకర్తలకు మత్తు పదార్థాల వినియోగం, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.మంజులాదేవి, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ డి.వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌లో వృద్ధురాలు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన ఏలూరు నగరంలోని సుస్మిత డయాగ్నస్టిక్స్‌లో మంగళవారం చోటు చేసుకుంది. సంబంధిత వివరాల ప్రకారం ఏలూరు రూరల్ పరిధిలోని ప్రతి కోళ్ల లంక గ్రామానికి చెందిన నల్లగచ్చు రామ తులసి(60) స్థానికంగా భర్తతో కలిసి జీవనాన్ని సాగిస్తుంది. ఆమెకు ముగ్గురు కుమారులు కలరు. ముగ్గురు వేరువేరు ప్రాంతాలలో ప్రభుత్వ ఉద్యోగాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గత కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. గుండె సంబంధిత వ్యాధితో పాటు డయాలసిస్ వ్యాధితో కూడా బాధపడుతుంది. గత రెండు రోజులుగా ఏలూరు నగరంలోని ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. శ్వాస సంబంధిత సమస్య రావడంతో ఆయుష్ వైద్యులు మంగళవారం ఆమెను సుస్మిత డయాగ్నస్టిక్స్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ చేయించాలని సూచించారు. దీంతో బంధువుల ఏలూరు ఆర్ఆర్ పేటలోని సుస్మిత డయాగ్నస్టిక్స్‌కు తరలించారు. వృద్ధురాలికి ఎంఆర్ఐ స్కానింగ్ చేస్తున్న సమయంలో ఆమె మృతి చెందింది. దీంతో బంధువులు స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఆమె మృతి చెందిందని ఆరోపిస్తున్నారు. ఆమె అనారోగ్య సమస్యల వల్ల ఒత్తిడికికి లోనై మృతిచెందిందా లేక మరేదైనా కారణం వల్ల మృతి చెందిందా అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. బంధువులు ఇంకా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఈ ఘటనపై ప్రస్తుతం కేసు నమోదు కాలేదు. ఘటనా స్థలానికి వెళ్లి రెండో పట్టణ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - ముదినేపల్లి

పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. టిడిపి ఎంఎల్‌సి పరిశీలకులు మంతే పార్థసారథి, కైకలూరు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో మండలంలోని బొమ్మినంపాడులో ఎంఎల్‌సి ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కొత్త ఓటర్లు ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం ఎంఎల్‌సి ఓటర్ల కరపత్రాలను గ్రామంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దారం సుధా, నీటి సంఘం అధ్యక్షులు కేనం ప్రసాదరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, టిడిపి గ్రామ అధ్యక్షులు ఎర్ర రాంబాబు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు

ముదినేపల్లి : మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముదినేపల్లి మండల వైసిపి నాయకులు కలిశారు. ఇటీవల వైసిపి రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులుగా మండలంలోని చిగురుకోటకు చెందిన కోమటి విష్ణు వర్ధన్‌ను నియమించారు. ఈ సందర్భంగా కైకలూరు మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, రాష్ట్ర మాజీ మంత్రి విడదల రజినితో కలిసి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపిపిల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, కలిదిండి ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, మర్రివాడ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులపై వైసిపిది కపట ప్రేమ

టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు మేఘలాదేవి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కళాశాలల విద్యార్థులపై కపట ప్రేమ చూపిస్తున్న జగన్ రెడ్డిని, వైసిపిని రాష్ట్ర విద్యార్థి లోకం అసహించుకుంటుందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ చేయడానికి ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని విద్యార్థులు, జగన్ రెడ్డి అధికారంలో నుంచి దిగిన తర్వాత గుర్తుకు వచ్చారా అని ఆమె ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఫీజు రియంబర్స్‌మెంట్ చేయకపోవడంతో తమ తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టారని, తాము కష్టపడి చదివి పాసైన కళాశాలకు ఫీజులు కట్టలేదని, సర్టిఫికెట్లు ఇవ్వలేదని, అప్పుడు అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ఏమి చేయలేకపోయారని విద్యార్థులు తెలుపుతున్నారని ఆమె అన్నారు. విద్యార్థులపై జగన్ రెడ్డి కపట ప్రేమ చూపిస్తున్నారని తెలిపారు. తన రాజకీయ పబ్బం గడుపుకోవడానికి విద్యార్థులను అడ్డం పెట్టుకొని, ముసలి కన్నీరు కారుస్తూ, కల్లబొల్లి మాటలు చెప్పి, ఫీజు పోరు అని డ్రామాలకు తెరలేపుతున్నాడని మేఘలాదేవి విమర్శించారు. రాష్ట్ర ప్రజలు తమ నాటకాలను నమ్మే ప్రసక్తిలో లేరని ఆమె పేర్కొన్నారు.

ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ కేంద్రం ఏర్పాటే ధ్యేయం

ఎంఎల్‌సి ఇండిపెండెంట్ అభ్యర్థి జీవి సుందర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ కేంద్రం ఏర్పాటు చేయడమే తన ధ్యేయమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఇండిపెండెంట్ అభ్యర్థి జీవి సుందర్ తెలిపారు. ఏలూరులోని ఇండోర్ స్టేడియం ఎదురుగా గల లేడీస్ లయన్స్ క్లబ్‌లో మంగళవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీవి సుందర్ మాట్లాడుతూ మెనిఫెస్టోను విడుదల చేసిన తర్వాతే ఓటర్లను ఓటు అడుగుతానని తెలిపారు. తనని గెలిపిస్తే పరిశ్రమలకు, విద్యాసంస్థలకు మధ్య వంతెనలా నిలిచి విద్యార్థులను పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో సన్నద్ధం అయ్యేలా ట్రెయినింగ్ చేయిస్తానని తెలిపారు. మాజీ ఎంపీ జివి హర్షవర్ధన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పుడు రాజకీయ పార్టీలకు సంబంధించి ఎటువంటి హోర్డింగ్లు ఉండరాదని, అలాంటిది ప్రభుత్వం హోల్డింగులు తొలగించకుండా వాటిపై గొడ్డలి కప్పుతున్నారని మండిపడ్డారు. వాటిని తక్షణం తొలగించకపోతే వారి పార్టీ తరపున హోర్డింగులు పెట్టిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు అలగ రవి, మాల మహానాడు జెఎసి పళ్లెం ప్రసాద్ పాల్గొన్నారు.

అపరిష్కృతంగా ప్రధాన సమస్యలు

పట్టించుకోని పాలకులు
ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో ఏళ్ల తరబడి ప్రధాన సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. గత పాలకులు, అధికారులు దృష్టి పెట్టకపోవటంతో ఆ సమస్యలు అలాగే మిగిలిపోయాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. చింతలపూడి నగర పంచాయతీలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న బస్సు షెల్టర్‌ను నేటికీ ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. చింతలపూడి నుంచి విజయవాడ వెళ్లే బస్సు పునరుద్ధరించలేకపోతున్నారు. దీంతో ప్రతివారం ఏదో పనిమీద విజయవాడ వెళ్లే ప్రయాణికులు ఏలూరు వరకు వెళ్లి, విజయవాడకు బస్సు ఎక్కవలసిన పరిస్థితి దాపరించింది. గతంలో చింతలపూడి నుంచి నేరుగా విజయవాడకు బస్సు ఉండడంతో ప్రయాణికులకు, వృద్ధులకు ఇబ్బందులు తప్పేవి. ఇప్పుడు ఆ సర్వీసులు రద్దు చేయడంతో ప్రజాసంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా చర్యలు తీసుకోవడం లేదు. విజయవాడ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

అధ్వానంగా రహదారులు

మండలంలోని బట్టువారిగూడెం రోడ్డు, కొమ్ముగూడెం రోడ్డు, ఊటసముద్రం ఇలా పలుచోట్ల రోడ్లు వేయని పరిస్థితి నెలకొంది. దీంతో వర్ష కాలం వస్తే ద్విచక్ర వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బట్టువారిగూడెం, బాలవారిగూడెంలో రోడ్డు వేయాలని గత ప్రభుత్వ హయాంలో మోకాళ్ల వరకు నీరు ఉన్న గుంతలలో ధర్నా నిర్వహించి, అనేకసార్లు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినా వారు స్పందించిన దాఖలాలు లేవు. నేటికీ ఆ సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా తెలేసోమవరం నుంచి ప్రగడవరం వెళ్లే రోడ్డు గుంతలతో



చింతలపూడి నగర పంచాయతీ

ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడపడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రహదారులను మరమ్మతులు చేయాలని, గుంతలు పూడ్చి ప్రయాణం సౌకర్యవంతంగా సాగేలా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బస్సు షెల్టర్ ఉపయోగంలోకి వచ్చేదెన్నడో!

అప్పటి కాంగ్రెస్ ఎంపీ కావూరి సాంబశివరావు ఎంపీ నిధులతో సుమారు రూ.75 లక్షలతో నిర్మించిన చింతలపూడి పాత బస్టాండ్ బస్సు షెల్టర్ నేటికీ అధికారులు ఉపయోగంలోకి తీసుకురాలేకపోతున్నారు. పాత బస్టాండ్ వద్ద బస్సు షెల్టర్ లేక, చిన్నారులు, మహిళలు, వృద్ధులు, గర్భిణులు ఎవరైనా వారి అనుకున్న గమ్యం చేరుటకు, ఆ బస్సు వచ్చేవరకు నిలువ కాల మీద నిలబడి ఉండవలసిన పరిస్థితి నెలకొంది. ఎండకు ఎండిన, వర్షానికి తడిసినా అలా నిలువు కాల మీద ఉండవలసిందే. ప్రస్తుతం ఉన్న ఆ బస్సు షెల్టర్‌ను ఎందుకు ఉపయోగంలోకి తీసుకురాలేకపోతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా బస్ షెల్టర్ వినియోగానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

మహిళలకు పబ్లిక్ మరుగుదొడ్లు లేని దుస్థితి

పేరుకే చింతలపూడి నియోజకవర్గం. మండలంలో ఎక్కడా మహిళలకు పబ్లిక్ మరుగుదొడ్లు లేని పరిస్థితి నెలకొంది. గత పాలకులు, ప్రజాప్రతినిధులు, మహిళల ఇబ్బందులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులకు ప్రజాసంఘాల నాయకులు పబ్లిక్ మరుగుదొడ్లు నిర్మించాలని, మహిళలకు సౌకర్యం కల్పించాలని అనేకమార్లు ఫిర్యాదులు చేసినా.. మహిళలకు మేలు జరగని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మహిళలకు పబ్లిక్ మరుగుదొడ్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

చింతలపూడికి మినీ బస్ డిపో వచ్చేనా?

చింతలపూడి మండల ప్రజల చిరకాల కోరిక చింతలపూడికి మినీ బస్సు డిపో రావాలని. గతంలో అనేకసార్లు చింతలపూడికి మినీ బస్సు డిపో తీసుకురావాలని ప్రయత్నించినా విఫలం చెందారు. చింతలపూడికి మినీ బస్ డిపో వస్తే మండల ప్రజలకు కాకుండా చుట్టుపక్కల మండలాలకు కూడా అనేక ఉపయోగాలు ఉన్నాయని, వ్యాపార లావాదేవీలు బలపడతాయని, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, తద్వారా వ్యాపారస్తులు కాకుండా చిన్నపాటి వ్యాపారస్తులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. మండలం అభివృద్ధికి దోహదం చేస్తాయని, మినీ బస్సు డిపో తీసుకువచ్చే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజా సంఘాల నాయకులు, మండల ప్రజలు కోరుకుంటున్నారు.


అంగన్వాడీ కేంద్రంలో పోషణ వాటికపై అవగాహన

ద్వారకాతిరుమల : మండలంలోని ద్వారకాతిరుమల సెక్టార్ పరిధిలోని గుండుగోలకుంట గ్రామంలో కోడ్ నెంబర్ 62 అంగన్వాడీ కేంద్రంలో పోషణ వాటికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మేరీ మాట్లాడుతూ గర్భిణులు ఎటువంటి ఎరువులు లేకుండా సేంద్రియ ఎరువులతో పండించిన ఆకుకూరలు, కూరగాయలను తినాలన్నారు. అనంతరం ఆ అంగన్వాడీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు, లోప పోషణ కలిగిన పిల్లలకు ఆకుకూరలు, కూరగాయలు అందించారు. వారు కూడా ఇంటి వద్ద సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలు పండించుకుని తినాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, గర్భవతులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు : ఈనెల 5వ తేదీ బుధవారం ఏలూరు 1వ పట్టణంలోని కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ వైఎంహెచ్ఎ హాల్ ఫీడరు, 11 కేవీ వెన్నవల్లివారి పేట ఫీడర్లకు లైన్ షిఫ్టింగ్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలోని కోటదిబ్బ, మెయిన్ బజార్, పాండురంగ థియేటర్, అగ్రహారం, మార్కెట్, కెనాల్ రోడ్, సత్యనారాయణ పేట, లంబాడి పేట, వెన్నవల్లి వారి పేట, భావిశెట్టి వారి పేట, నల్లదిబ్బ పరిసర ప్రాంతాలలో నిలిపివేయబడునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.


పలుచోట్ల ప్రపంచ కేన్సర్ దినోత్సవం



ఏలూరు సిటీ : ఆశ్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ఆశ్రమం హాస్పిటల్స్‌లో ఆశ్రమం కేన్సర్ కేర్, ఏలూరు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆశ్రమ హాస్పిటల్స్ సిఇఒ డాక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ స్క్రీనింగ్ శిబిరంలో ఉచితంగా వైద్య సలహాలతో పాటు, అవసరమగు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో నోటి కేన్సర్, థైరాయిడ్, రొమ్ము కేన్సర్, తదితర కేన్సర్లకు వైద్యులు తమ సలహాలు అందించి వైద్య పరీక్షలు నిర్వహించారని అన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లవల్లి చలపతిరావు మాట్లాడుతూ ఆశ్రమ కేన్సర్ కేర్ ద్వారా క్లీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేయడం, ప్రాణాంతక వ్యాధుల పట్ల అవగాహన చేయడంలో భాగస్వాములవ్వడం చాలా తృప్తినిచ్చిందన్నారు. 122 మంది రోగులు ఈ శిబిరం ద్వారా సేవలు పొందాలని తెలియజేశారు. ఈ శిబిరంలో అంకాలజీ వైద్యులు డాక్టర్ శైలజ, డాక్టర్ సింధు, డాక్టర్ కన్మణి, ఇతర విభాగాలకు చెందిన వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ముసునూరు : రమణక్కపేటలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ముసునూరు : కేన్సర్ వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కాదని రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎండి కరీముల్లా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన సెంటర్ వద్దకు ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ అంటువ్యాధి కాదని, కేన్సర్ వ్యాధిని ముందుగా గమనించినట్లయితే ఆరోగ్య సూత్రాల ద్వారా మందులు వాడి ప్రాణ నష్టం లేకుండా చూసుకోవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

రేణుక, రాహుల్ భవిష్యత్తుకు సహకరించాలి

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ

చింతలపూడి : రేణుక, రాహుల్ అనే చిన్నారుల భవిష్యత్ కోసం దాతలు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ కోరారు. జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో ఇద్దరు చిన్నారుల విషయంలో జరిగిన సంఘటన అందరికీ తెలిసిందే. ఈ విషయం మీద జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్పిటల్‌లో జాయిన్ చేయటం జరిగిందన్నారు. హాస్పిటల్ వారు తెలిపిన మీదట వాళ్లను 3 రోజుల్లో డిచార్జి చేస్తారని, తల్లిదండ్రులు వాళ్ల మీద చేసిన చర్యల కోసం వాళ్ల దగ్గర ఉంటే వాళ్లకి రక్షణ ఉండదు అనే ఉద్దేశ్యంతో కలెక్టర్ వాళ్లని ఏలూరు చిల్డ్రన్ హోమ్‌కు షిఫ్ట్ చేయడానికి మాకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అదేవిధంగా కొంతమంది దాతలు పిల్లల భవిష్యత్ కోసం, వాళ్ల రక్షణ కోసం సహాయం చేస్తున్నారని, అలాంటి దాతల కోసం యూనియన్ బ్యాంకులో ఆర్‌డిఒ పేరు మీదుగా అకౌంట్ క్రియేట్ చేసి అందులో డిపాజిట్ చేసి వాళ్ల మేజర్స్ అయ్యాక వాళ్లకి అందేటట్టుగా కలెక్టర్ అకౌంట్ ఏర్పాటు చేయమని యూనియన్ బ్యాంక్‌లో ఒక జాయింట్ అకౌంట్ ఏర్పాటు చేశారన్నారు. ఎవరైతే డొనేషన్స్ ఇస్తారో వారు ఆ అకౌంట్‌లో వేయాలని అన్నారు.

సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం

ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్


ఏలూరు స్పోర్ట్స్ : మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు పోలీసు శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు రూరల్ పరిధిలోని పాలగూడెం ప్రాంతానికి చెందిన జి.రాంబాబు దెందులూరు పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితం అనారోగ్య కారణాలతో విజయవాడలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి విజయవాడలో మంగళవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సందర్శనార్థం ఏలూరు రూరల్ పరిధిలోని పాలగూడెం ప్రాంతానికి చేర్చారు. ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ సిబ్బందితో కలిసి పాలగూడెం ప్రాంతానికి వెళ్లి అక్కడ రాంబాబు మృతదేహానికి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మీకు ఏ సహాయ సహాయం కావాలన్నా వెంటనే తనని సంప్రదించాలని సూచించారు. మృతిచెందిన కుటుంబ సభ్యులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి అడ్మిన్ నక్క సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సిఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మా గ్రామాలను ముంపు పరిధిలోకి తీసుకోండి

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం మొదటి కాంటూరు లెవెల్‌లోని నిర్వాసితుల సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ఐటిడిఎ పిఒ రాములునాయక్, ఆర్అండ్ఆర్ అధికారి విచ్చేశారు. ఈ గ్రామసభలో అనేక సమస్యలతో కొన్ని వేల దరఖాస్తులు నిర్వాసితులు పెట్టుకున్నారు. కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా తమ గ్రామాలను కూడా ముంపులో తీసుకోవాలని సుమారు 15 గ్రామాల నిర్వాసితులు అడగగా, ఆర్అండ్ఆర్ అధికారి ఇది తన పరిధి సమస్య కాదు అని తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిపోయారు. ఆ మాటకు ఆగ్రహించిన నిర్వాసితులు తహశీల్దార్ కార్యాలయం ముందే ధర్నాకు దిగారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి, పిఒ బయటకు రావాలి, సమాధానం చెప్పాలి అని నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం సర్వస్వం కోల్పోయి, ఏళ్ల తరబడి అనేక ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ సమస్యలు పరిష్కరించటం లేదని వాపోయారు. ఎన్ని గ్రామసభలు పెట్టి దరఖాస్తులు



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ

పెట్టినా ఉపయోగం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల సమయంలో మా బాధలు వర్ణణాతీతమని బాధను వెళ్లగక్కారు. తప్పుడు కాంటూర్ లెక్కల తోటి తమ గ్రామాలను ముంపులో తీసుకోకుండా వదిలేయటం అంటే మమ్మల్ని జలసమాధి చేయడమే అన్నారు. ఏటా రెండు, మూడు సార్లు వచ్చే వరదలు ప్రభుత్వానికి, అధికారులకు కనపడలేదని గుర్తు చేశారు. అరగంట తర్వాత ధర్నా దగ్గరకి పిఒ వచ్చి సమస్యని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వగా నిర్వాసితులు ధర్నాని విరమించారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జిల్లా నాయకులు మడివి దుర్గారావు, కారం వెంకట్రావు, ఉదయ్ కిరణ్, రాంబాబు సిపిఐఎంల్ మాస్ లైన్ ప్రజా పందా నాయకులు మడివి రంగమ్మ, కుంజా సత్తిబాబు, ఆదివాసీ నాయకులు ఊకె ముత్యాలరావు, మోటుకు రాంబాబు, నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రైతులు విధిగా రశీదులు తీసుకోవాలి

ఎడిఎ నాగ కుమార్

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులందరూ ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో దుకాణదారుల నుంచి కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని ఇంటర్నల్ స్క్వాడ్ ఇన్‌ఛార్జి, చింతలపూడి ఎడిఎ నాగకుమార్ అన్నారు. ఇంటర్నల్ స్క్వాడ్ ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలంలో మంగళవారం ఎరువుల, పురుగుమందుల దుకాణాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగ కుమార్ మాట్లాడుతూ ఎంఆర్‌పి ధరలకు మించి ఎరువులు అమ్మినట్లయినా, బిల్లులు ఇవ్వకుండా పురుగుమందులు విక్రయించినా చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సదరు లైసెన్సులు రద్దు చేయడానికి సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని చిగురుకోట గ్రామంలో దుర్గశ్రీ ట్రేడర్స్‌లో సరైన పత్రాలు లేకుండా అమ్మకానికి ఉంచిన రూ.1,06,886 విలువైన పురుగు మందులను ఈ సందర్భంగా సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఎడిఎ నాగకుమార్

పుట్రేపు రోడ్డుకు మోక్షం

20 ఏళ్ల తర్వాత తారు రోడ్డు నిర్మాణం
హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని పుట్రేపు రోడ్డుకు సుమారు 20 ఏళ్ల తర్వాత అభివృద్ధికి మోక్షం లభించింది. ఎట్టకేలకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పుట్రేపు, రుద్రకోటరాజుగూడెం తదితర గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పుట్రేపు, రుద్రకోటరాజుగూడెం, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజుగూడెం, కాపుగూడెం గ్రామాల మీదుగా టి.నరసాపురం-మక్కినవారిగూడెం అడ్డరోడ్డు నుంచి బండివారిగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లే పుట్రేపు రోడ్డు, సుమారు 3.9 కిలోమీటర్ల ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డును 20 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తారు రోడ్డు నిర్మించారు. ఆ తర్వాత కొంతకాలానికి రోడ్డు గోతులమయంగా మారింది. అప్పటి నుంచి అధ్వాన్నంగా ఉన్న రోడ్డు వల్ల వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. రోడ్డు అభివృద్ధి చేయాలని మండల ప్రజలు పలుమార్లు ధర్నాలు,



తారు రోడ్డు వేయిస్తున్న అధికారులు

రాస్తారోకోలు నిర్వహించారు. అధికారులకు, ఎంఎల్ఎలకు సహితం వినతి పత్రాలు అందించారు. కాని ప్రభుత్వాలు మారినా రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో పుట్రేపు రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వం ఎంఎల్ఎ, ఎంపీల సహకారంతో రూ.కోటి 75 లక్షల పంచాయతీ రాజ్ నిధులతో మంజూరు చేసింది. దీంతో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు(సూరిబాబు) గత ఏడాది ఫిబ్రవరిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. గత ఏడాది జూన్‌లో కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టి మెటల్ పోశారు. 7 నెలలు తరువాత కాంట్రాక్టర్ మళ్లీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. తారు రోడ్డు నిర్మిస్తుండటంతో ఆ ప్రాంతంలో ప్రయాణికులు, ప్రజలు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల నిరీక్షణకు తెరపడిందని, ఇకపై సుఖవంతమైన ప్రయాణం లభిస్తుందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్న నాయకులకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.